

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 30-07-2025 | సంపుటి - 24 | సంచిక - 85 | రూ : 4 | పేజీలు:


## హైదరాబాద్ నగరంలో

# అలాంటి పరిస్థితి తలెత్తకూడదు



- హైదరాబాద్ నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి
- కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడి
- పాతికేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించాలని ఆదేశం

ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాల్లో విపరీతమైన కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్ నగరంలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భాగ్యనగరాన్ని కాలుష్యరహిత నగరంగా మార్చే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పాతికేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో అండర్ డ్రైనేజీ, కేబుల్ వ్యవస్థలపై దృష్టి సారించాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు వారసత్వ కట్టడాలను రక్షించి, పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. పాతబస్తీ మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కోర్ సిటీలోని కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు

తరువాయి 2లో

## మంత్రి లోకేశ్ సమక్షంలో టెజరాక్ట్

# యూట్యూబ్ అకాడమీలతో ఎంఓయూ



2లో

- ఏపీలో క్రియేటర్ అకాడమీ ఏర్పాటుకు అవగాహన ఒప్పందం
- సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం
- దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించడమే ఒప్పందం ప్రధాన లక్ష్యమన్న మంత్రి

2లో

# ప్రధాని మోదీపై విరుచుకుపడిన సోనియాగాంధీ



## హిమాచల్ ప్రదేశ్ ను

# ముంచెత్తిన వరదలు..

- మండి జిల్లాలో బీభత్సం..
- ఈ రోజు తెల్లవారుజామున కుండపోత
- కొట్టుకుపోయిన వాహనాలు.. రోడ్లు ధ్వంసం
- లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి చేరిన వరద

హిమాచల్ ప్రదేశ్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు తెల్లవారుజామున మండి జిల్లాలో కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలోని పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. రోడ్లు ధ్వంసమయ్యాయి, వాహనాలు కొట్టుకుపోయాయి. వరద తగ్గిన తర్వాత బురదలో కూరుకుపోయాయి. వర్ష బీభత్సానికి

తరువాయి 2లో

## ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో

# ఏ నేత మాకు చెప్పలేదు

### : లోక్ సభ వేదికగా మోదీ ప్రకటన

- కాంగ్రెస్ పార్టీపై నరేంద్ర మోదీ ఆగ్రహం
- కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని స్పష్టీకరణ
- పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పానన్న మోదీ
- ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టడం శోచనీయమన్న మోదీ

లోక్‌సభ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులకు పాల్పడినా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని, దుశ్చర్యలకు తెగ బడితే దీటుగా బదులిస్తామని ఆయన హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెడుతున్నామని

తరువాయి 2లో





2లో

## ప్రజలారా!

# మోసపోకండి

- 'బాలయ్య-బసవతారకం ఈవెంట్'పై నందమూరి బాలకృష్ణ స్పందన
- బసవతారకం ఆసుపత్రి పేరిట మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలను నమ్మవద్దని సూచన
- అనధికారిక, తప్పుదారి పట్టించే కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- 'బంగారు బాలయ్య -బసవతారకం ఈవెంట్'తో తనకు సంబంధం లేదని స్పష్టీకరణ

# సముద్రాన్ని పూడ్చి నిర్మించిన జూరాంగ్ దీవిని సందర్శించిన సీఎం

## సింగపూర్ లో చంద్రబాబు బృందం పర్యటన




- పెట్రోకెమికల్ ఐల్యాండ్‌ను సందర్శించిన చంద్రబాబు
- ఏపీలో పారిశ్రామిక-లాజిస్టిక్ కారిడార్ పై ప్రకటన

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోని కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులను కలుపుతూ పారిశ్రామిక లాజిస్టిక్ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మంగళవారం ప్రతిష్ఠాత్మక జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్‌ను సందర్శించిన అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ పోర్టుల అనుసంధానంతో పాటు, వాటికి సమీపంలో ప్రపంచశ్రేణి చమురు రిఫైనరీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్‌లో సింగపూర్ సృష్టించిన సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు, ఇతర మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి, మంత్రుల బృందం నిశితంగా పరిశీలించింది. సముద్రాన్ని పూడ్చి నిర్మించిన ఈ దీవిలో సమీకృత పెట్రోకెమికల్ ప్లాంట్, ఇంధన కేంద్రాన్ని సింగపూర్ ఏర్పాటు చేసింది. సుర్బానా జురాంగ్ డిప్యూటీ డైరెక్టర్ టియో ఎంగ్ కియాట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆండీలీ ముఖ్యమంత్రి బృందానికి స్వాగతం పలికి జురాంగ్ పెట్రోకెమికల్ కేంద్రాన్ని, దాని వ్యూహాత్మక ప్రాముఖ్యతను వివరించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు చేసిన ప్రణాళికలు, వివిధ యుటిలిటీ మోడల్స్, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను, అలాగే ముడి చమురు ప్రాసెసింగ్ ప్రక్రియతో పాటు పాలిమర్లు, ఇంధనాలు, స్పెషాలిటీ కెమికల్స్ వంటి ఇతర ఉత్పత్తుల గురించి వివరించారు. దాదాపు 3 వేల హెక్టార్ల సముద్రాన్ని భూమిగా మార్చి అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ హబ్‌ను ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టులో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, సమీకృత భద్రతా వ్యవస్థలు

తరువాయి 2లో

## ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత మాకు చెప్పలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వెల్లడించారు. 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టి ఉగ్రవాదులను ఏరివేస్తున్నట్లు చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో చర్చకు సమాధానంగా మోదీ ప్రసంగించారు. కాల్పుల విరమణలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్రను ప్రధానమంత్రి తోసిపుచ్చారు. ఉగ్రవాదులను హతమార్చినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' ఆపాలని ప్రపంచంలో ఏ నేత మనకు చెప్పలేదని ఆయన అన్నారు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో ఫోన్‌లో మాట్లాడారని, పాక్ భారీ దాడి చేయబోతోందని హెచ్చరించారని వెల్లడించారు. అలా జరిగితే పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు స్పష్టం చేశానని అన్నారు. పాకిస్థాన్‌కు ఎవరు సాయం చేసినా చూస్తూ ఊరుకునేది లేదని తేల్చి చెప్పామని అన్నారు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెబుతామని చెప్పానని, చెప్పినట్లుగానే పాక్‌కు ఎప్పటికీ గుర్తుండిపోయే సమాధానం ఇచ్చామని ప్రధానమంత్రి అన్నారు. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి 'ఆపరేషన్ సిందూర్' ఆపాలని కోరితేనే నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గామ్ దాడి చేశారని మండిపడ్డారు. ఆ తర్వాత మన సైన్యం పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లి 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలు 'ఆపరేషన్ సిందూర్'ను సమర్థించాయని, పాకిస్థాన్ వైపు మూడు దేశాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'ను కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టడం శోచనీయమని ప్రధానమంత్రి అన్నారు. మీడియా హెడ్‌లైన్‌లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మీడియా హెడ్‌లైన్‌లలో ఉంటారేమో కానీ ప్రజల మనసుల్లో ఉండలేరని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనుకేసుకు రావడం దౌర్భాగ్యమని ఆయన అన్నారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడు కూడా కాంగ్రెస్ ఇలాగే మాట్లాడిందని, కానీ ఆయనను సురక్షితంగా తీసుకువచ్చామని గుర్తు చేశారు. భారత సైనిక శక్తిపై తమకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్ నగరంలో అలాంటి పరిస్థితి తలెత్తకూడదు

(మొదటిపేజీ తరువాయి)

తరలించాలని అధికారులకు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ముఖ్యమంత్రి అన్నారు. నిర్మాణ రంగ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. మంచినీరు, మురుగు నీరు వ్యవస్థలను పూర్తిగా సంస్కరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మూసీపై బ్రిడ్జ్ కమ్ బ్యారేజీకి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జూపార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అత్యాధునిక వసతులతో హోటల్ నిర్మించాలని ముఖ్యమంత్రి అన్నారు.

## ప్రజలారా! మోసపోకండి

బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి పేరుతో జరుగుతున్న మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలను నమ్మవద్దని సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రజలను హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అనధికారికంగా, తప్పుదారి పట్టించే విధంగా ఉన్న కార్యక్రమాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బసవతారకం ఆసుపత్రి తరఫున జరిగే అన్ని అధికారిక కార్యక్రమాలు, విరాళాల అభ్యర్థనలు ధ్రువీకరించబడిన, పారదర్శక మాధ్యమాల ద్వారా మాత్రమే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "ప్రజలకు హెచ్చరిక. 'బంగారు బాలయ్య బసవతారకం ఈవెంట్' పేరుతో అశ్విన్ అట్లూరి అనే వ్యక్తి నా పేరును, బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి పేరును అనుమతి లేకుండా ఉపయోగిస్తూ విరాళాల సేకరణ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి నా అనుమతి లేదు. ఆసుపత్రి ట్రస్ట్ బోర్డు తరఫున కూడా ఎటువంటి అధికారిక ఆమోదం లేదు" అని బాలకృష్ణ పేర్కొన్నారు.

## ప్రధాని మోదీపై విరుచుకుపడిన సోనియాగాంధీ

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సంక్షోభంపై 'నీచమైన మౌనం' వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. గాజా ప్రజలకు మద్దతుగా భారతదేశం 'స్పష్టమైన, ధైర్యవంతమైన' వైఖరిని తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం దైనిక్ జాగరణ్‌లో ప్రచురితమైన ఆమె వ్యాసంలో ఈ మేరకు పేర్కొన్నారు. 'గాజా సంకట్ పర్ మూక్‌దర్శక్ మోదీ సర్కార్' (గాజా సంక్షోభంపై మౌనంగా ఉన్న మోదీ సర్కార్) అనే శీర్షికతో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియా గాంధీ ఇజ్రాయెల్ చర్యలను 'బార్బరిక్' (అనాగరికం), 'జెనోసైడ్' (మారణహోమం)గా అభివర్ణించారు. గాజాలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ విధించిన సైనిక నిర్బంధం, ఔషధాలు, ఆహారం, ఇంధన సరఫరాను క్రూరంగా నిరోధించడం 'మానవత్వానికి వ్యతిరేకమైన నేరం' అని ఆమె ఆరోపించారు. గాజా సంక్షోభంపై ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడం 'రాజ్యాంగ విలువలకు ద్రోహం' అని ఆమె తీవ్రంగా విమర్శించారు.

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడులు, ఇజ్రాయెలీ బందీలపై కొనసాగిస్తున్న చర్యలను తాను ఏమీ సమర్థించబోనని సోనియా స్పష్టం చేశారు. అయితే, ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజా పౌరులపై చేపట్టిన ప్రతీకార చర్యలు 'అత్యంత దారుణమైనవి, నేరపూరితమైనవి' అని ఆమె ఆరోపించారు. గత రెండేళ్లలో గాజాలో 55,000 మంది పౌరులు, అందులో 17,000 మంది పిల్లలు మరణించారని, చాలా వరకు నివాస భవనాలు ధ్వంసమయ్యాయని, గాజా సామాజిక వ్యవస్థ పూర్తిగా శిథిలమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**భారతదేశ చారిత్రక వైఖరి**

1974లో ఇందిరా గాంధీ నాయకత్వంలో పాలస్తీన్ లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌వో)ను పాలస్తీనియన్ ప్రజల ఏకైక చట్టబద్ధమైన ప్రతినిధిగా గుర్తించిన మొదటి అరబ్‌యేతర దేశంగా భారత్ నిలిచిందని సోనియా గుర్తు చేశారు. 1988లో పాలస్తీన్ దేశాన్ని అధికారికంగా గుర్తించిన మొదటి దేశాలలో భారతదేశం ఒకటని ఆమె పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు మరోసారి భారతదేశం నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నాయని, మోదీ 'స్పష్టంగా, ధైర్యంగా, సూటిగా' మాట్లాడాలని సోనియా కోరారు.

## బీసీ బిల్లు సాధన కోసం మూడు రోజుల దీక్ష : ఎమ్మెల్సీ కవిత

* **బీసీ బిల్లు సాధన కోసం ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలు దీక్ష చేస్తానన్న కవిత**
* **ఈ బిల్లు దేశానికి ఎంత అవసరమో చాటి చెప్పేందుకు దీక్ష అంటూ ప్రకటన**
* **బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష**

బీసీ బిల్లు సాధన కోసం 72 గంటలు దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఈ బిల్లు దేశానికి ఎంత అవసరమో చాటి చెప్పేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలు దీక్ష చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈ రోజు హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష చేయనున్నట్టు చెప్పారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అన్ని పార్టీలతో వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో తలపెట్టిన ధర్నాను కేవలం బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న డ్రామాగా ఆమె పేర్కొన్నారు. అటు, బీజేపీ నేతలు బీసీలకు అండగా ఉండాల్సిన సమయంలో తప్పించుకుని తిరుగుతున్నారని కవిత దుయ్యబట్టారు.





## సముద్రాన్ని పూడ్చి నిర్మించిన జూరాంగ్ దీవిని సందర్శించిన సీఎం



ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏపీ పారిశ్రామిక ప్రగతిలో సింగపూర్ కంపెనీలు గ్లోబల్ భాగస్వాములుగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్, ఏపీ ఉన్నతాధికారులు కూడా ముఖ్యమంత్రితో పాటు జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్‌ను సందర్శించారు.

* **ఏపీ తీర ప్రాంతం: అభివృద్ధికి ముఖ ద్వారం, పెట్టుబడులకు గమ్యస్థానం**

సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ కంపెనీల సీఈఓలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను వివరించారు. రాష్ట్రంలో 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఏపీకి అతిపెద్ద వనరు అని నొక్కి చెప్పారు. మారిటైమ్ ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పనపై సీఈఓలతో చర్చించారు. పోర్టుల నిర్మాణం, పోర్ట్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6 ఆపరేటింగ్ పోర్టులు ఉన్నాయని, మరో నాలుగు కొత్త పోర్టులు రానున్నాయని వెల్లడించారు. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని, డ్రై పోర్టుల నిర్మాణం, ఇన్ ల్యాండ్ వాటర్‌వేస్ ద్వారా సరుకు రవాణా వంటి ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. టూరిజంకు పెద్ద పీట వేస్తున్నామని, క్రూయిజ్ టూరిజానికి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు.

* **సింగపూర్ దేశ అధ్యక్షుడు, మాజీ ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ**

సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాని, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఏపీ, సింగపూర్ ప్రభుత్వాలు కలిసి వివిధ రంగాల్లో పనిచేసే అంశంపై చర్చించారు. ఈ పర్యటనతో ఏపీలోని వివిధ రంగాల్లో సింగపూర్‌తో కలిసి పనిచేసేలా కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లు ముఖ్యమంత్రి షణ్ముగరత్నంతో చెప్పారు. నాలెడ్జ్ ఎకానమీ, మౌలిక సదుపాయాల కల్పన, సెమీకండక్టర్లు, అమరావతి అభివృద్ధి, అర్బన్ ప్లానింగ్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యంతో ముందుకు వెళ్లే అంశాలపై ఇరువురు నేతలతో ముఖ్యమంత్రి చర్చించారు. సింగపూర్ మాజీ ప్రధాని లీ సైన్ లూంగ్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు.. భారత్ సింగపూర్‌ల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యేందుకు తమ పర్యటన ఉపకరిస్తుందని అన్నారు.

### మంత్రి లోకేశ్ సమక్షంలో

## టెజరాక్ట్, యూట్యూబ్ అకాడమీలతో ఎంఓయూ



ఏపీలో సృజనాత్మక ఆర్థిక వృద్ధి కోసం క్రియేటర్ అకాడమీని స్థాపించడానికి రెండు ప్రధాన సంస్థలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్ షాంగ్రీలా హోటల్ లో జరిగిన కార్యక్రమంలో టెజారాక్ట్, US Inc. ప్రెసిడెంట్ తేజ ధర్మ, యూట్యూబ్ అకాడమీ ఇండియా హెడ్ అర్జున్ దొరైస్వామి, ఏపీ ప్రభుత్వం ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సృజనాత్మక కంటెంట్ తయారీ కోసం ఏపీ ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేస్తుంది. పాఠ్యాంశాలు, శిక్షణా కార్యక్రమాలకు గూగుల్ సంస్థ వనరులు, సాంకేతికత, నైపుణ్యాలను అందించనుండగా.. టెజారాక్ట్ సంస్థ ఫిజికల్ సెటప్, నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. డిజిటల్ కంటెంట్ పరిశ్రమలో విజయం సాధించేందుకు ఔత్సాహిక సృష్టికర్తలను సన్నద్ధం చేయడం, వారికి అవసరమైన స్కిల్స్, నాలెడ్జ్, వనరులు సమకూర్చడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించడమే ఒప్పందం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి లోకేశ్ అన్నారు.

## హిమాచల్ ప్రదేశ్ ను ముంచెత్తిన వరదలు..

సంబంధించి స్థానికులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్ లోడ్ చేయగా.. అవి వైరల్ గా మారాయి. వరదల కారణంగా జిల్లాలోని పలు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని నివాసాలను వరద ముంచెత్తింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో ముగ్గురు మరణించారని అధికారులు తెలిపారు. భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని వివరించారు. మండి జిల్లా కేంద్రంలోని జైల్ రోడ్, జోనల్ హాస్పిటల్ రోడ్, సైంజ్ రీజియన్ తదితర ప్రాంతాల్లో వరదల ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్, మండి డిప్యూటీ కమిషనర్ తదితరులు పర్యటించారు. కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో, శిథిలాల తొలగింపులో రెస్క్యూ సిబ్బంది 24 గంటలూ నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. కాగా, వర్షాలకు పలుచోట్ల కొండచరియలు విరిగిపడడంతో పఠాన్‌కోట్ మండి జాతీయ రహదారి, కిరాత్పూర్ మనాలి నాలుగు లేన్ల రహదారి, చండీగఢ్ మనాలి హైవేలు మూతపడ్డాయి. కొండచరియలను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

### కొంపముంచిన మానవత్వం..

## సాయం చేసినందుకు 13 నెలల జైలు!

భోపాల్: కొన్నిసార్లు మంచి చేసేందుకు ప్రయత్నించినా.. కథ అడ్డం తిరిగి మనమే వివాదాల్లో చిక్కుకోవాల్సి వస్తుంది. చివరికి ముద్దాయిగా తేలిన సందర్భాలూ ఉంటాయి. సరిగ్గా ఇలాంటి అనుభవమే మధ్యప్రదేశ్‌లోని ఓ సామాన్యుడికి ఎదురైంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను ఆస్పత్రిలో చేర్చి.. 13 నెలలు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. భోపాల్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన రాజేశ్ విశ్వకర్మ ఓ సాధారణ దినసరి కూలీ. స్థానిక మురికివాడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కుటుంబంతో జీవనం సాగించేవాడు. గతేడాది జూన్‌లో తన పొరుగింటి మహిళ అనారోగ్యానికి గురవ్వడంతో.. దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. కాస్త బెరుకుగా సమాధానాలు చెప్పడంతో అతడే చంపేసి ఉంటాడని భావించి.. అరెస్టు చేశారు. అక్కడికి 9 రోజుల వరకు కనీసం కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వలేదు. పేదవాడు కావడంతో అతడి తరఫున వాదించేందుకు లాయర్లెవరూ ముందుకు రాలేదు. దీంతో న్యాయస్థానం ఈ కేసును ప్రభుత్వ న్యాయవాదికి అప్పగించింది. రాజేశ్‌ను కలిసి జరిగిన విషయం చెప్పాలని ఆయన కోరగా.. తన తప్పేమీ లేదని, ఆరోగ్యం బాగోలేకపోడంతోనే ఆమెను ఆస్పత్రిలో చేర్చానని వివరించాడు. మరోవైపు మెడికల్ రిపోర్టుల్లోనూ అనారోగ్యంతోనే మృతి చెందినట్లు ఉండటాన్ని గుర్తించిన లాయర్‌కు పోస్టుమార్టం రిపోర్టులో గొంతుకోసి చంపినట్లు ఎలా వచ్చిందో అర్థం కాలేదు. దీనిపై పోలీసులను లోతుగా ప్రశ్నించగా.. అసలు విషయం బయటపడింది. పోలీసులు, పోస్టుమార్టం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగినట్లు గుర్తించిన లాయర్.. ఇదే విషయాన్ని కోర్టుకు ఆధారాలతో సహా సమర్పించారు. రాజేశ్‌ను నిరపరాధిగా గుర్తించిన న్యాయస్థానం అతడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అయితే, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తన జీవితం మరింత దుర్భరంగా తయారైందని



రాజేశ్ వాపోతున్నాడు. తన కుటుంబం రోడ్డున పడిందని, 13 నెలల క్రితం పోలీసులు ఇంటికి తాళం వేయడంతో.. అప్పటి నుంచి అద్దె చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నాడు. మరోవైపు జైలుకెళ్లి వచ్చానన్న కారణంతో తనకు ఎవరూ పని ఇవ్వడం లేదన్నాడు. దీంతో కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కావడం లేదని వాపోతున్నాడు.

# ముస్తాబాద్‌లో దుర్భరంగా పారిశుద్ధ్యం

* **బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల కాంత్రి**
* **పట్టణ పారిశుద్ధ్యంపై ఈఓకు వినతి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో పారిశుద్ధ్యం దుర్భరంగా మారిందని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల కాంత్రి అన్నారు. ముస్తాబాద్ పట్టణ పారిశుద్ధ్యంపై మేజర్ గ్రామ పంచాయతీ ఈఓకు బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ముస్తాబాద్ మండల కేంద్రంలో పారిశుద్ధ్యంపై పట్టించుకోలేదని, ఎవరైనా ముస్తాబాద్‌కు కొత్తగా వస్తే మురికితో స్వాగతం పలికే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న గ్రామాల్లో పరిశుభ్రతపై కార్యక్రమాలు నిర్వహించి అవార్డు తెచ్చుకున్నారని, ముస్తాబాద్ పెద్ద చెరువును పర్యాటక ప్రాంతంగా మారుస్తామని చెప్పి మరిచారని అన్నారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 11లక్షల రూపాయలు మత్స శాఖ నుంచి, మరో 12 లక్షలు జడ్పి నిధుల నుంచి మంజూరు చేసి ఫిష్, కూరగాయల మార్కెట్ షెడ్లను నిర్మించారని, అవి గత 15 ఏళ్లుగా అలంకార ప్రాయంగా ఉన్నాయని, వాటిని పట్టించుకునే నాథుడే లేడని అన్నారు. దీంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని అన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ముస్తాబాద్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మురుగు నీరంతా కలిసే పరిస్థితులు ఏర్పడ్డాయని, గతంలో ఈ ప్రాంతంలో చిల్డ్రన్స్ పార్క్ నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ ప్రాంతంలో 2 ఎకరాల



ప్రభుత్వ భూమి అన్యక్రాంతం అవుతుందని అన్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే భవిష్యత్‌లో బిజెపి ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, మెంగాని మహేందర్, మీస శంకర్, చిట్టినేని శ్రీనివాస రావు, పద్మ, దీటి సత్యం, కాసోడి రమేష్, రవి వెంకటేష్, ఒరగంటి సత్యం, బుర్ర శ్రీనివాస్, పున్నం అనిల్, మద్దికుంట రమేష్, దారవేని రాజు తదితరులున్నారు.

## లిఫ్ట్ ప్రమాదానికి గురైన భాధితులకు కార్పొరేటర్ నిత్యవసర సరుకులు అందజేత



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బీరంగుడాలోని దుస్తుల దుకాణంలో ట్యాగులు తొలగించే పనికి వెళ్లి వస్త్ర దుకాణంలో లిఫ్ట్ ప్రమాదానికి గురై మెరిడియాన్ హాస్పిటల్లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన బాధితులను మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన లిఫ్ట్ ప్రమాదానికి గురైన తోమ్మిది మంది బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైన వారందరూ త్వరగా కోలుకోవాలని అన్నారు. ప్రమాదానికి గురైన వారంతా పేద కుటుంబాలకు చెందిన వారని, వారికి అన్ని విధాలా సాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మల్లేష్, షౌకత్ అలీ మున్నా, వాలి నాగేశ్వరరావు, ఫజల్, గౌస్, శేరిలింగంపల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక, రాజ్యలక్ష్మి, సౌందర్య, అరుణ, కృష్ణవేణి, రమాదేవి, పుట్టం దేవి, బి సుజాత, సుజాత, నిక్కత్ ఫాతిమా, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాకుకు గురైన కాంగ్రెస్ కార్యకర్తకు ఆర్థిక సహాయం



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజ్గిరి వినాయక నగర్ లో నివాసం ఉంటున్న సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త జయంతి కుమారునికి ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుకిగురై గాయల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు ఆదేశాల మేరకు , మెదక్ ఎమ్మెల్యే రోహిత్ సూచన మేరకు మంగళవారం అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల నాగరాజు మాట్లాడుతూ మైనంపల్లి అభిమానులకు ప్రతిఒక్క కార్యకర్తకు మైనంపల్లి హనుమంతరావు ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉంటాయి అని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేక్షంగా పోరాడే అవకాశాన్ని ప్రజలు కల్పిస్తారని ఆశిస్తూ అలాగే మైనంపల్లి హనుమంతరావు స్ఫూర్తితో మానవ సేవే మాధవ సేవ అంటూ నేను చేసే ప్రతి సేవ ఆ వెంకటేశ్వర స్వామే నా చేత చేయిస్తున్నాడని నమ్ముతూ ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి పీఎన్ఆర్ గ్రూప్ సభ్యుల సహకారం ఉండడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఆర్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ కి శుభాకాంక్షలు

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : ఇల్లందు పోలీస్ స్టేషన్లో నూతనంగా సీఐ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తాటిపాముల సురేష్ ని టిడిపి ఇల్లందు మండల కమిటీ ఇల్లందు టిడిపి మండలం అధ్యక్షులు పుట్టా ఉపేందర్ యాదవ్ క్లింట్ రోచ్ నూతలపాటి వెంకటేశ్వర్లు, తొలెం వెంకటస్వామి, గుళ్ళ మొగిలి ఉన్నం భాస్కర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.





### విద్యాలయాల వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేసి
## సమయానికి బస్సు సౌకర్యాలు కల్పించాలి

* **ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం మొదలుకొని వివిధ మండలాలలో విద్యాలయాల వద్ద బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని, విద్యాలయాల సమయానుగుణంగా విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్సు డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే గణేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్, రామచంద్ర డిగ్రీ , పీజీ కళాశాలలు అదే విధంగా పలు ప్రైవేటు విద్యాసంస్థలు అనేకం ఉన్నాయని, ఇంటి వద్ద పరిస్థితుల రీత్యా పేద విద్యార్థులు రవాణా సౌకర్యం పెరగడంతో ఎక్కువ మంది విద్యార్థులు గ్రామాల నుండి విద్యాసంస్థలకు హాజరవుతున్నారన్నారు. పట్టణంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల పట్టణ చివరలో ఉన్నందున పలు సంక్షేమ హాస్టల్స్ కొత్తగూడెం పట్టణ ఇటు చివరన ఉన్నందువల్ల హాస్టల్ విద్యార్థులు కూడా బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. పలు మండల కేంద్రాలలో కూడా డిగ్రీ, ఇంటర్ కళాశాలలు గ్రామాల చివర ఉన్నాయన్నారు. కేవలం బస్టాప్ ల వద్ద మాత్రమే బస్సును ఆపటం వలన విద్యార్థులు ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారన్నారు. అతికొద్ది బస్సులు మాత్రమే విద్యాలయాల వద్ద ఎప్పుడో ఒకసారి ఆపుతున్నారు. కేవలం కొత్తగూడెం ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉన్నదన్నారు. ఈ సందర్భంలోనే గతంలో నడిపిన బడి బస్సు తిరిగి ప్రారంభించాలని, విద్యాసంస్థల సమయానుకూలంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి. భార్గవ్ ,కె. నిఖిల్ , వి. నవదీష్. సన్నీ. యశ్వంత్, వి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



### 24 గంటలు వైద్య సేవలు అందించే పిహెచ్సి సెంటర్లకి
## అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి

* **మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : 24 గంటలు వైద్య సేవలు అందించే పిహెచ్సి సెంటర్లకి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం కీసర మండలంలోని పిహెచ్సి సెంటర్ ను డిఎం అండ్ హెచ్ ఓ ఉమా గౌరీ తో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు ఎన్ని ఓపి కేసులు ఉంటాయని ఎన్ని ప్రసవాలు జరుగుతాయని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ రోజుకు ఎంతమందికి వేస్తారని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారా అని ఈ ఆసుపత్రి కింద ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ ను మెడిసన్ రూమ్ నో ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వర్షం నీరు కురిసి గోడలు నిమ్మ రావడం పరిశీలించిన కలెక్టరు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశించారు. ఆస్పత్రికి అవసరమైన మరమ్మత్తులు సంబంధించిన ప్రతిపాదన లు తనకు పంపాలని మెడికల్ ఆఫీసర్ కు కలెక్టర్ సూచించారు అనంతరం జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణాలను స్థలాన్ని ఆర్ డి ఓ ఉపేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు ఈ పర్యటనలో కీసర ఎమ్మార్వో అశోక్ మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### రౌడీ షీటర్లకు
## ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ కౌన్సెలింగ్

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు :ఇల్లందు పట్టణంలో మంగళవారం సీఐ సురేష్ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రౌడీ షెటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న, పెద్ద నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత నాలుగు రోజుల క్రితం ఇల్లందు సిఐ గా బాధ్యతలు చేపట్టిన సురేష్ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజల సహకారాన్ని పొందేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మొదటిసారిగా రౌడీ షీటర్ లను సమీకరించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ సురేష్ తో పాటు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, హసీన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర)లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి, బైపిసిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ కౌన్సెల్‌ను ఈ నెల 31న చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి గ్రూప్‌లో 15 సీట్లు, బైపిసిలో 33 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కి ఒరిజినల్ సర్టిఫికెట్స్ (కులము, ఆదాయం), ఎస్ఎస్‌సి మార్కుల షీట్ తో హాజరు కావాలని తెలిపారు.

## కొత్తగూడెం భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలోని భవిత కేంద్రాన్ని ఎంఈఓ డాక్టర్ ప్రభు దయాల్ మంగళవారం సందర్శించారు. పిల్లలతో కాసేపు గడిపి ఆహ్లాదకరమైన పరిస్థితులలో కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. భవిత కేంద్రంలో కొందరు విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రైటర్ బస్తీలో మధ్యాహ్న భోజన పథకంలో భోజనము స్వీకరిస్తున్నందున వారందరికీ స్టీల్ ప్లేట్స్ బహూకరించారు. మెనూ పాటిస్తూ చక్కటి వేడివేడి భోజన పదార్థాలను విద్యార్థులకు అందించాలని హెడ్మాస్టర్ కు సూచించారు.

## సింగరేణి సీ&ఎండీ బలరాం నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం :కొత్తగూడెం సింగరేణి పేదవర్గాల ఆశాజ్యోతి బలరాం నాయక్ అని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. మంగళవారం సింగరేణి సీఅండ్ఎండి బలరాం నాయక్ కు జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లందు గెస్ట్ హౌస్ లోని ఆయన నివాసానికి వెళ్లి జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్,న్యాయవాది మారపాక రమేష్ కుమార్ లు శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత పేద గిరిజన కుటుంబం నుండి పుట్టి,ఎన్నో సామాజిక,ఆర్థిక అడ్డంకులను ధైర్యంగా తట్టుకొని,ఐఆర్ఎస్ అధికారిగా భారత పరిపాలనా వ్యవస్థలో అడుగుపెట్టి,ప్రస్తుతం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యొక్క చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బలరాం నాయక్ అనిచివేతకు గురైన వర్గాలకు మార్గదర్శకంగా నిలుస్తూ,సమాజంలో న్యాయస్వరూప స్థాపనకు సంకల్పబద్ధంగా పనిచేస్తున్నారన్నారు. బలరాం నాయక్ తాను బాబాసాహెబ్ అంబేద్కర్ వారసత్వాన్ని కంటిన్యూ చేస్తూ ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ,రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు,సమానావకాశాలను కల్పించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమైనదని అన్నారు.

## ఖమ్మంలో పర్యటించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ఖమ్మం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు రాష్ట్రవ్యాప్త పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఆయన ఇవాళ ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఖమ్మం పట్టణంలోని సప్తపది ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు.





# అక్కను హత్య చేసిన తమ్ముడు అరెస్టు

కొత్తూరు: తల్లిదండ్రులు వద్దన్న వ్యక్తితో మాట్లాడుతోందని అక్కను హత మార్చిన తమ్ముడిని రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం పెంజర్లకు చెందిన దేశాల రాఘవేందర్‌కు రుచిత, రోహిత్ సంతానం. రుచిత డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉండగా కుమారుడు రోహిత్ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రుచిత, అదే గ్రామానికి చెందిన ఈర్లపల్లి దినేశ్ గతకొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో పంచాయితీ పెట్టి దినేశ్‌ను మందలించారు. సోమవారం తల్లిదండ్రులు పనికి వెళ్లగా.. ఇంట్లో రుచిత, ఆమె సోదరుడు రోహిత్ మాత్రమే ఉన్నారు. ఆ సమయంలో దినేశ్‌తో రుచిత మాట్లాడటాన్ని గమనించిన రోహిత్.. సోదరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో గొడవకు దిగి ఆమె గొంతుకు వైరు బిగించి హత్య చేశాడు. కుమారుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి రాఘవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం కొత్తూరు టౌన్‌లోని పెంజర్ల క్రాస్ రోడ్డు వద్ద రోహిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. దినేశ్‌తో అక్క తరచూ ఫోన్‌లో మాట్లాడుతోందనే హత్య చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు.

# ఎంజీబీఎస్ వద్ద మూసీలో ఆక్రమణలు తొలగించిన హైడ్రా

హైదరాబాద్: ఎంజీబీఎస్ వద్ద మూసీ నదిలో ఆక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు మూసీలో మట్టి పోసి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. ఒక్కో బస్సు నుంచి రూ.300, ఒక్కో గుడిసె నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ స్థలంపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో అధికారులు స్పందించారు. ప్రభుత్వ ఆదేశాలతో పార్కింగ్ స్థలాన్ని హైడ్రా పరిరక్షించింది.



# హైకోర్టు న్యాయమూర్తిపైనే అభ్యంతరకర వ్యాఖ్యలా?

*** సీజేఐ జస్టిస్ గవాయ్**

దిల్లీ: భూ వివాదం వ్యవహారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మరోసారి ఊరట లభించింది. సొసైటీ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం..ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.



*** పిటిషనర్, న్యాయవాదిపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

# సికింద్రాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో పోలీసుల తనిఖీలు

హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. క్లూస్‌టీమ్ సహాయంతో గోపాలపురం పోలీసులు ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పలువురి నుంచి సేకరించిన వీర్యకణాలకు సంబంధించిన మూడు డబ్బాలు, ఆధార్ కార్డులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిగా ఉన్న పంకజ్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇటీవల సృష్టి టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్ అక్రమాలు బయటపడిన నేపథ్యంలో ఇండియన్ స్మెర్మ్ టెక్‌లో రోజువారీ కూలీలు, యాచకులు, పాదచారులకు కమీషన్



ఇచ్చి వీర్య కణాలు, అండాలను సేకరిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మభ్యపెడుతోంది: మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను కాంగ్రెస్ మభ్య పెడుతోందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చివరికి పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఎలా చేస్తారని అప్పుడు అడిగితే మా వ్యూహం మాకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపమంతా భాజపా, భారత రాష్ట్ర సమితిపై నెట్టేస్తోంది. 42 శాతం రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల విషయంలో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు? భారత రాష్ట్ర సమితి తరఫున కూడా రాష్ట్రపతిని కలిసి.. 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరతాం. అధికార యంత్రాంగంలోనూ కీలకమైన స్థానాలను ఓ



అగ్రవర్ణం వారికే ఇచ్చారు. కార్పొరేషన్ పదవుల్లో సగం బీసీలకు ఇవ్వాలి" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు.

# తెలంగాణ వెదర్ అప్డేట్..మరో 2గంటల్లో ఈ జిల్లాలకు వర్షసూచన

తెలంగాణలో మరో రెండు గంటల్లో వర్షం కురవబోతున్నట్టు వెదర్ మ్యాన్ ప్రకటించారు. కొన్ని జిల్లాల్లో స్వల్ప వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లో మరో రెండు గంటల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 5 నుండి 10 నిమిషాల పాటు




స్వల్ప వర్షాపాతం నమోదవుతుందని, భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. నగర వాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు

**: ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్**

హైదరాబాద్: మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ పనిచేస్తుందని చెప్పారు. లగచర్ల ఘటన, గురుకుల పాఠశాల విద్యార్థుల విషయంపై భారత రాష్ట్ర సమితి నేతలు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. తమ పార్టీకి చెందిన నేతలు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ శ్రవణ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ వి.రామసుబ్రమణియన్ మాట్లాడారు. "అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. రాష్ట్రానికి చెందిన 106 కేసులను పరిష్కరించాం. సీఎస్, డీజీపీ, జైళ్ల శాఖ డీజీ, అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాం. రైతుల సమస్యలు, మహిళలు, చిన్నారులపై దాడులు, దివ్యాంగుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నాం. వసతిగృహాల్లో




సౌకర్యాలలేమిపై అధికారులను ప్రశ్నించాం. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని.. ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించాం. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవాలను బట్టి సుమోటోగా విచారణ చేపడుతున్నాం. పోలీస్, జ్యుడీషియల్ కస్టడీలో మృతి చెందిన ఘటనల్లో ప్రత్యేకంగా దర్యాప్తు చేయిస్తున్నాం. సహజ మరణమా? అధికారులు కారణమా? అనే విషయాలపై దర్యాప్తు చేయిస్తాం. పోలీసు, జైలు అధికారుల తప్పిదం ఉంటే చర్యలకు సిపార్సు చేస్తున్నాం. ఎన్‌హెచ్‌ఆర్‌సీలో 34,865 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో తెలంగాణకు సంబంధించి కేసులు 780 ఉన్నాయి" అని జస్టిస్ వి.రామసుబ్రమణియన్ తెలిపారు.

# ఉద్యోగాల పేరుతో రూ.140 కోట్లు వసూలు.. 'ముద్ర కోఆపరేటివ్ సొసైటీ' ఛైర్మన్ అరెస్టు

హైదరాబాద్: ముద్ర అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ తిప్పనేని రామదాసప్పను తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. రామదాసప్పతోపాటు ఆయన కుమారుడు సాయికిరణ్‌ను మంగళవారం అమరావతిలో అదుపులోకి తీసుకున్నారు. సీఐడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో 2వేలకుపైగా బాధితుల నుంచి రామదాసప్ప రూ.140 కోట్లు వసూలు చేశారు. 2వేల మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగాల కోసం తెలుగు రాష్ట్రాల నుంచి బాధితులు వారిని సంప్రదించి పెద్దమొత్తాల్లో నగదు చెల్లించారు. ఆ తర్వాత రైతుల నుంచి పెట్టుబడులు తేవాలని, లేదంటే జీతం నుంచి తీసుకుంటామని రామదాసప్ప ఉద్యోగులను వేధించారు. తీసుకున్న సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో అతడిపై తెలుగు రాష్ట్రాల్లోని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన తెలంగాణ సీఐడీ అధికారులు తాజాగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన రెవెన్యూ సంఘాల నేతలు..

## పదోన్నతి కల్పించడంపై కృతజ్ఞతలు



రాష్ట్రంలో 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు, జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సంఘాల నాయకులు మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీసీఎల్ఏ లోకేష్ కుమార్ కు, ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అన్ని స్థాయిల్లోని రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. అన్ని క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ పదోన్నతులు రెవెన్యూ శాఖలో ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని పెంచి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడానికి దోహదపడతాయన్నారు. వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెవెన్యూ శాఖలో పదోన్నతుల శకం మొదలైందన్నారు. చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రస్తుతం 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించిందన్నారు. ఇదే కాకుండా సీనియర్ అసిస్టెంట్ నుంచి నయాబ్ తహశీల్దార్ వరకు పదోన్నతులను కల్పించిందన్నారు. అలాగే రాష్ట్రంలోని 10,954 గ్రామాలలో జీపీఓల నియామకం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తహశీల్దార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాకలు రాధ, సెక్రెటరీ జనరల్ పూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుకు ప్రమోషన్.. ఎవరీ దయా నాయక్?

మహారాష్ట్రలో 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు'గా పేరొందిన దయా నాయక్‌కు ఏసీపీగా పదోన్నతి లభించింది. ఆయనతోపాటు మరికొందరు అధికారులు కూడా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లుగా ప్రమోషన్ పొందిన వారిలో ఉన్నారు. 1990ల్లో ముంబయిలో అండర్‌వరల్డ్ కార్యకలాపాలు తీవ్రంగా ఉన్న సమయంలో దాదాపు 80 మంది గ్యాంగ్‌స్టర్లను దయా నాయక్ ఎన్‌కౌంటర్ చేసినట్లు సమాచారం. ఈయన స్ఫూర్తితో గతంలో హిందీతోపాటు పలు భాషల్లో సినిమాలు కూడా వచ్చిన సంగతి తెలిసిందే.



**ఎవరీ దయా నాయక్..?**

కర్ణాటకలోని ఉడిపిలో జన్మించిన దయా నాయక్ బాల్యం ఎక్కువగా ముంబయిలో కొనసాగింది. అంధేరీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనంతరం 1995లో పోలీస్ నియామకాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ముంబయిలో విధుల్లో చేరారు. ఆ సమయానికి నగరంలో అండర్‌వరల్డ్ పేరుతో విపరీతంగా దందాలు, హత్యలు, డ్రగ్స్, హవాలా సహా ఎన్నో నేరాలు జరిగేవి. ఈ క్రమంలోనే 1996లో చోటా రాజన్ గ్యాంగ్‌లోని ఇద్దరిని కాల్చి చంపడంతో దయా నాయక్ పేరు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ప్రజల్లోనే కాక, డిపార్ట్‌మెంట్‌లోనూ ఆ పేరు మార్మోగిపోయింది. అండర్ వరల్డ్ నెట్‌వర్క్‌కు సంబంధించి పనిచేస్తున్న దాదాపు 80 మంది గ్యాంగ్‌స్టర్లను ఎన్‌కౌంటర్ చేసినట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పేరు సంపాదించినప్పటికీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దయా నాయక్‌ను ఏసీబీ గతంలో అరెస్ట్ చేసింది. ఆ తర్వాత క్లీన్‌చిట్ రావడంతో మళ్లీ 2012లో ఆయన తిరిగి విధుల్లో చేరారు. మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌లోనూ పనిచేశారు. 2021లో ముఖేష్ అంబానీ ఇంటివద్ద పేలుడు పదార్థాల కేసు, అనంతరం థాణె వ్యాపారవేత్త మన్‌సుఖ్ హిరెన్ హత్య కేసుల దర్యాప్తు బృందాల్లో ఉన్నారు. అంతేకాదు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి ఘటన దర్యాప్తు బృందంలోనూ ఆయన కనిపించారు.





## వాడీవేడి చర్చ..
# ఖర్గేకు జేపీ నడ్డా క్షమాపణలు

ఆపరేషన్ సిందూర్‌పై రాజసభ్యలోనూ వాడీవేడి చర్చ జరిగింది. ఈ క్రమంలో రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సభాపక్ష నేత జేపీ నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. దీంతో అధికార, విపక్ష సభ్యుల చప్పుళ్లతో సభ కొద్దిసేపు దద్దరిల్లింది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పడంతో సభ సద్దుమణిగింది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ పైనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షుడు 'మానసిక సమతుల్యత' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో నడ్డా చర్యలను తీవ్రంగా తప్పుపట్టిన విపక్షాలు క్షమాపణ చెప్పాలంటూ బల్లలు చరుస్తూ ఆందోళన చేపట్టాయి. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వంలో తాను గౌరవించే మంత్రుల్లో నడ్డా కూడా ఒకరని, అయినప్పటికీ తనపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వెంటనే కేంద్ర మంత్రి నడ్డా స్పందిస్తూ.. ఇప్పటికే తన మాటలు వెనక్కి తీసుకున్నానని, క్షమాపణ కూడా చెప్పానని అన్నారు. "నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ ఉన్న నాయకుడు. అందుకు భాజపానే కాదు దేశం మొత్తం గర్విస్తోంది" అని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. ఖర్గే మాత్రం ఆయన స్థాయిని పట్టించుకోకుండా అభ్యంతరకరంగా మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ తన పరిధిని దాటి ప్రధానిపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అవి ఆయన స్థాయికి తగినట్లు లేవని, వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని జేపీ నడ్డా పేర్కొన్నారు.

# మన సైనికుల చేతులు కట్టేశారు..: రాహుల్ గాంధీ

ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. "సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు.



ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారు." అని రాహుల్ గాంధీ విమర్శించారు. "పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్‌పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలి" అని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు.

## కొంపముంచిన మానవత్వం..
# సాయం చేసినందుకు 13 నెలల జైలు!

భోపాల్: కొన్నిసార్లు మంచి చేసేందుకు ప్రయత్నించినా.. కథ అడ్డం తిరిగి మనమే వివాదాల్లో చిక్కుకోవాల్సి వస్తుంది. చివరికి ముద్దాయిగా తేలిన సందర్భాలూ ఉంటాయి. సరిగ్గా ఇలాంటి అనుభవమే మధ్యప్రదేశ్‌లోని ఓ సామాన్యుడికి ఎదురైంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను ఆస్పత్రిలో చేర్చి.. 13 నెలలు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. భోపాల్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన రాజేశ్ విశ్వకర్మ ఓ సాధారణ దినసరి కూలీ. స్థానిక మురికివాడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కుటుంబంతో జీవనం సాగించేవాడు. గతేడాది జూన్‌లో తన పొరుగింటి మహిళ అనారోగ్యానికి గురవ్వడంతో.. దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. కాస్త బెరుకుగా సమాధానాలు చెప్పడంతో అతడే చంపేసి ఉంటాడని భావించి.. అరెస్టు చేశారు. అక్కడికి 9 రోజుల వరకు కనీసం కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వలేదు. పేదవాడు కావడంతో అతడి తరఫున వాదించేందుకు లాయర్లెవరూ ముందుకు రాలేదు. దీంతో న్యాయస్థానం ఈ కేసును ప్రభుత్వ న్యాయవాదికి అప్పగించింది. రాజేశ్‌ను కలిసి జరిగిన విషయం చెప్పాలని ఆయన కోరగా.. తన తప్పేమీ లేదని, ఆరోగ్యం బాగోలేకపోడంతోనే ఆమెను ఆస్పత్రిలో చేర్చానని వివరించాడు. మరోవైపు మెడికల్ రిపోర్టుల్లోనూ అనారోగ్యంతోనే మృతి చెందినట్లు ఉండటాన్ని గుర్తించిన లాయర్‌కు పోస్టుమార్టం రిపోర్టులో గొంతుకోసి చంపినట్లు ఎలా వచ్చిందో అర్థం కాలేదు. దీనిపై పోలీసులను లోతుగా ప్రశ్నించగా.. అసలు విషయం బయటపడింది. పోలీసులు, పోస్టుమార్టం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగినట్లు గుర్తించిన లాయర్.. ఇదే విషయాన్ని కోర్టుకు ఆధారాలతో సహా సమర్పించారు. రాజేశ్‌ను నిరపరాధిగా గుర్తించిన న్యాయస్థానం అతడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అయితే, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తన



జీవితం మరింత దుర్భరంగా తయారైందని రాజేశ్ వాపోతున్నాడు. తన కుటుంబం రోడ్డున పడిందని, 13 నెలల క్రితం పోలీసులు ఇంటికి తాళం వేయడంతో.. అప్పటి నుంచి అద్దె చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నాడు. మరోవైపు జైలుకెళ్లి వచ్చానన్న కారణంతో తనకు ఎవరూ పని ఇవ్వడం లేదన్నాడు. దీంతో కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కావడం లేదని వాపోతున్నాడు.

# అప్పటినుంచి చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదు: రిజిజు

భారత భూభాగంలోకి చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. 1962 నుంచి ఇదే పరిస్థితి అని మంగళవారం లోక్‌సభకు వెల్లడించారు. రికార్డులను సరిచేయడం ఎంతోముఖ్యమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. "నా సొంతరాష్ట్రంలోకి చైనా ప్రవేశించి, ఆక్రమణలకు పాల్పడిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ముఖ్యమని నేను భావించాను. అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ప్రాంతం 1962 యుద్ధానికి ముందు లేదా ఆ సమయంలో ఆక్రమించారు. ఆ తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తలేదు" అని వెల్లడించారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అరుణాచల్‌ప్రదేశ్ లోని పలు ప్రాంతాల పేర్లను మార్చడానికి డ్రాగన్ యత్నించింది. దానిని పలుమార్లు భారత్



తిరస్కరించింది కూడా. "అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని.. అది విడదీయరాని భాగమని.. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరు" అని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇక గత ఏడాది ఈ ఆసియా దేశాల మధ్య గస్తీ దోస్తీ కుదిరింది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాలు.. ఆ ఒప్పందం తర్వాత కాస్త మెరుగయ్యాయి.

# 'సీఎం పోస్టు'పై ఖర్గే ఆవేదన.. సమర్థించిన డీకే

ఇటీవల ఓ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ గతంలో కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను శ్రమించినా, పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి బాధ్యతలను ఎస్.ఎం.కృష్ణకు అప్పగించిందన్న మాటలను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సమర్థించారు. ఖర్గే కాంగ్రెస్ పార్టీ కోసం అవిశ్రాంతంగా పని చేసిన సీనియర్ నాయకుడని.. ఆయన తన భావాలను వ్యక్తపరచడంలో ఎటువంటి తప్పు లేదని అన్నారు. అయితే రాజకీయాల్లో ఉన్నవారు తమ భావాలను వ్యక్తపరచవచ్చు కానీ.. అది బహిరంగంగా మాత్రం కాదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని బెలిమరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ.. తాను ఎన్నడూ అధికారం కోసం వెంపర్లాడలేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను శ్రమించినా, పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి బాధ్యతలను ఎస్.ఎం.కృష్ణకు అప్పగించిందని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి స్థానం దక్కకపోగా, తన సేవలన్నీ



వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికీ నిరాశకు గురికాకుండా పార్టీ శ్రేయస్సు కోసం శ్రమించడంతోనే తనకు ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా..కొంతకాలంగా కర్ణాటకలో సీఎం పదవికి సంబంధించిన విషయంలో పలు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు సిద్ధరామయ్య డీకే శివకుమార్ లేకుండానే విధానసౌధలో ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించడంతో ఇరువురి మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయా అని మీడియా డీకే శివకుమార్‌ను ప్రశ్నించింది. దీనికి ఆయన బదులిస్తూ..అవేమీ లేవని అన్నారు. సీఎం నిధుల విషయంలో శాసనసభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నారని..అందులో తనకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. బెంగళూరు అభివృద్ధికి సంబంధించిన విషయంలో తాను కూడా కొందరు ఎమ్మెల్యేలతో సమావేశమైనట్లు తెలిపారు. తమ ప్రభుత్వంపై భాజపా చేస్తున్న విమర్శలపై శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాక్‌పిట్‌లోకి దూసుకొచ్చి.. భారత సంతతి కోపైలట్ అరెస్ట్

భారత సంతతికి చెందిన కోపైలట్ రుస్తుం భగ్వాగర్ అమెరికాలో అరెస్టయ్యాడు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అతడిని కాక్‌పిట్ నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డెల్టా ఎయిర్‌లైన్స్‌లో విధులు నిర్వర్తిస్తోన్న అతడిపై చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలు ఉన్నాయి. డెల్టా సంస్థకు చెందిన బోయింగ్ విమానం మిన్నియాపోలిస్ నుంచి బయల్దేరి, శాన్‌ఫ్రాన్సిస్కోలో ల్యాండ్ అయింది. అది దిగిన పది నిమిషాల వ్యవధిలోనే పోలీసులు కాక్‌పిట్‌లో దూసుకువచ్చారు. విమానం నుంచి దిగాలని ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఆ పరిణామంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.




లోపలికి వెళ్లిన భద్రతాసిబ్బంది కోపైలట్ భగ్వాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. "వేర్వేరు సంస్థలకు చెందిన దుస్తులు ధరించిన అధికారులు తుపాకులతో లోపలికి వచ్చారు. అతడికి బేడీలు వేసి తీసుకెళ్లారు" అని ఓ ప్రయాణికుడు మీడియా వెల్లడించారు.

# నెలలుగా యుద్ధం.. 60 వేలు దాటిన మరణాలు!

భీకర దాడులు.. ఆకలి కేకలు.. వెరసి గాజాలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. గత 21 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంలో స్థానికంగా మృతుల సంఖ్య 60 వేలు దాటింది. మరో 1.45 లక్షల మంది గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని పేర్కొంది. గత 24 గంటల్లోనే 113 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 637 మంది గాయపడ్డారని తెలిపింది. అయితే, మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు.

**'అత్యంత దారుణమైన కరవు'..**

ఆహార సంక్షోభంతో కొంతకాలంగా గాజా పౌరుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. స్థానికంగా అత్యంత దారుణమైన కరవు పరిస్థితి నెలకొందని, తక్షణమే చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున మరణాలు సంభవించే అవకాశం ఉందని ఐరాస సహకారంతో రూపొందిన 'ఐపీసీ' నివేదిక అంచనా వేసింది. "మే జూలై మధ్యకాలంలో తీవ్ర ఆకలిని ఎదుర్కొంటున్న కుటుంబాల సంఖ్య రెట్టింపు అయ్యింది. గాజా సిటీలో పోషకాహార లోపం రేటు మేలో 4.4 శాతంగా ఉండగా.. జులై నాటికి ఏకంగా 16.5 శాతానికి పెరిగింది. గర్భిణులు, బాలింతల్లో ఐదింట రెండొంతుల మంది జూన్‌లో తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడ్డారు" అని పేర్కొంది.

# టీసీఎస్‌లో సీనియర్ల నియామకాలు నిలిపివేత..!




టెక్ దిగ్గజం టీసీఎస్ సీనియర్ల నియామకాలను నిలిపేసినట్లు వార్తలొస్తున్నాయి. దీంతోపాటు వార్షిక వేతనాల పెంపును ఆపినట్లు ఆంగ్ల పత్రిక ఎకనామిక్ టైమ్స్ కథనం వెలువరించింది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సంస్థ సీఈవో కె.కృతివాసన్ ప్రకటించిన సమయంలో ఈ విషయం ప్రచారంలోకి రావడం గమనార్హం. ప్రస్తుతం ఐటీ రంగంలో డిమాండ్ తగ్గడం.. కృత్రిమ మేధ నుంచి ముప్పు పొంచి ఉండటం వంటి అంశాలు ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తున్నాయి. పరిశ్రమలో పెద్ద కంపెనీగా ఉన్న టీసీఎస్ పాటించే వ్యూహాలను సాఫ్ట్‌వేర్ రంగంలోని ఇతర సంస్థలు కూడా అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే నియమించుకొన్న సీనియర్లను కూడా జాయిన్ చేసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఇక పుణే, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తాలోని బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూదనే నియమాన్ని అమలుచేస్తోంది. ఇక కంపెనీలోని పరిణామాలపై ఆ సంస్థ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. టీసీఎస్ చేపట్టిన వాటిల్లో మధ్య, సీనియర్ స్థాయి లేఆఫ్‌లే కంపెనీకి రూ.2,400 నుంచి రూ.3,600 కోట్ల వరకు ఆదా చేయనున్నాయి. కాకపోతే ఈ లేఆఫ్‌లను ఒక్కసారిగా కాకుండా.. మెల్లగా ఓ క్రమపద్ధతిలో అమలుచేస్తామని సీఈవో వెల్లడించారు. టీసీఎస్ కంపెనీ ఉద్యోగుల్లో 2 శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగాల కోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గత ఏడాదికి పైగా వ్యవధిలో కంపెనీ షేరు 30 శాతం కుంగింది. నిఫ్టీ సూచీలోని ఐటీ షేర్లలో ఇదే బలహీనంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.




## పడిపోయిన పసిడి ధరలు..!



* హైదరాబాదులో నేటి బంగారం ధర..
* 22 క్యారెట్ల బంగారం ధర- రూ. 92, 500 (నిన్నటి ధర రూ.91, 600)
* 24 క్యారెట్ల బంగారం ధర- రూ. 99, 820(నిన్నటి ధర రూ. 99,930)
* విజయవాడలో నేటి బంగారం ధర.
* 22 క్యారెట్ల బంగారం ధర- రూ. 92, 500 (నిన్నటి ధర రూ. 91, 600)
* 24 క్యారెట్ల బంగారం ధర- రూ. 99, 820

# టెక్ ఉద్యోగాలకు ఏఐ బెడద



టెక్ రంగంలోని ఉద్యోగులలో భయం మొదలైంది. ఇటీవల ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపులను ప్రకటించడమే ఇందుకు కారణం. టీసీఎస్ ఈ తొలగింపులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) కారణం కాదని, 'స్కిల్స్ మిస్‌మ్యాచ్' మాత్రమేనని చెప్పినప్పటికీ, అన్ని రంగాలలో ఉద్యోగాలకు ఏఐ ముప్పు ఉందనే అనుమానాలు పెరిగాయి. పరిశ్రమ విశ్లేషకుల ప్రకారం, టీసీఎస్ లాంటి దిగ్గజ కంపెనీయే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు, ఇతర కంపెనీలు సైతం దాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఏఐ, ఆటోమేషన్ కారణంగా ఐటీ రంగంలో మరిన్ని కోతలకు దారితీయవచ్చని సందేహిస్తున్నారు. ఈ క్రమంలోనే, భారత ఐటీ రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమ సంస్థ నాస్కామ్ ప్రకారం, టీసీఎస్ తొలగింపులు 'వర్క్‌ఫోర్స్ రేషనలైజేషన్ (శ్రామిక శక్తి హేతుబద్ధీకరణ)' ధోరణికి సంకేతమని, కంపెనీలు ఏఐఆధారిత మోడళ్ల వైపు మొగ్గు చూపుతున్నాయని అభిప్రాయపడింది.

భవిష్యత్తులో ప్రభావితం చేసే అంశాలు

* వర్క్‌ఫోర్స్ రేషనలైజేషన్: సంస్థలు ఐటీ పరిశ్రమ వృద్ధి, ఆవిష్కరణ, వేగం కోసం క్లయింట్ డిమాండ్లను తీర్చేందుకు అవసరమైన మోడళ్లకు మారుతున్నాయి. ఫలితంగా సమీప భవిష్యత్తులో కొన్ని మార్పులను స్వీకరించేందుకు వర్క్‌ఫోర్స్ రేషనలైజేషన్ తప్పదని నాస్కామ్ భావిస్తోంది. * ఏఐ, ఆటోమేషన్ ప్రభావం: ఏఐ, ఆటోమేషన్ వ్యాపార కార్యకలాపాలకు కేంద్రంగా మారడంతో, ఐటీ పరిశ్రమ కీలక మలుపులో ఉంది. ఈ మార్పు సాంప్రదాయ సేవల డెలివరీ ఫ్రేమ్‌వర్క్‌లను పునర్నిర్మించే అవకాశం ఉంది. సాంప్రదాయ నైపుణ్యాలను తిరిగి సమీక్షిస్తున్నందున ఈ ధోరణి కనిపిస్తోంది.
* స్కిల్స్, స్కిల్స్ అప్‌గ్రేడ్: భవిష్యత్తులో టెక్నాలజీ మార్పు నేపథ్యంలో అందుకు సిద్ధంగా ఉండటం, స్థిరంగా స్కిల్స్ పెంచుకునే అలవాటు, క్రాస్‌స్కిల్లింగ్ ఉద్యోగులకు చాలా ముఖ్యం. నైపుణ్య అంతరాన్ని తగ్గించడానికి. ఏఐ యుగంలో భారత టెక్ లీడర్‌షిప్‌గా కొనసాగేందుకు పరిశ్రమ, విద్యాసంస్థలు, ప్రభుత్వం మధ్య సహకారం అవసరం ఉందని నాస్కామ్ పేర్కొంది.
* పరిశ్రమ ధోరణి: స్థూల ఆర్థిక ఒత్తిళ్లు, మారుతున్న క్లయింట్ అంచనాలు, కొత్త సాంకేతికతల స్వీకరణ కారణంగా మరింత సమర్థవంతమైన, పనితీరు కేంద్రీకృత ఉద్యోగుల అవసరం ఐటీ పరిశ్రమకు ఉంది. ఇలాంటి పరిణామాల మధ్య తాజా తొలగింపులు, ఇతర చర్యలు తప్పవని నాస్కామ్ వెల్లడించింది.

**ఉద్యోగులపై ప్రభావం**

* ప్రమాదంలో ఉద్యోగ భద్రత: టీసీఎస్ లేఆఫ్స్ నిర్ణయం ఐటీ పరిశ్రమలోని ఉద్యోగులలో ఉద్యోగ అభద్రతను పెంచాయి. ఏఐ, ఆటోమేషన్ కారణంగా వారి ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయా అని చాలామంది ఆలోచిస్తున్నారు.
* స్కిల్స్ అప్‌గ్రేడ్: ఏఐ, క్లౌడ్‌ఆధారిత సాంకేతికతలు, అప్లయిడ్ ఇంటిలిజెన్స్ వంటి అంశాల్లో స్కిల్స్ అభివృద్ధి చేయడంపై దృష్టి సారించడం తప్పనిసరి. పరిశ్రమలో కొనసాగాలంటే ఉద్యోగులు తమ స్కిల్స్, రీస్కిల్స్ పెంచుకోవాలి.
* మారుతున్న ఉద్యోగ మార్కెట్: డీప్, ప్రత్యేక నైపుణ్యం కోసం పెరుగుతున్న డిమాండ్ వల్ల జాబ్ మార్కెట్ మరింత అడ్వాన్స్‌గా ఉండనుంది.

**ఐటీ భవిష్యత్తు**

* ఏఐఆధారిత కార్యకలాపాలు: సామర్థ్యం, ఇన్నోవేషన్‌ను మెరుగుపరచడానికి కంపెనీలు ఏఐ, ఆటోమేషన్‌కు మారుతుండటంతో ఐటీ పరిశ్రమ మరింత ఏఐఆధారిత రంగంగా మారుతుందని భావిస్తున్నారు.
* కొత్త ఉద్యోగ అవకాశాలు: ఏఐ కొన్ని ఉద్యోగాలను ప్రభావితం చేసినప్పటికీ, ఇది ఏఐ అభివృద్ధి, విస్తరణ, నిర్వహణ వంటి రంగాలలో కొత్త అవకాశాలు లభించనున్నాయి.
* విద్యారంగ సహకారం: నైపుణ్య అంతరాన్ని తగ్గించడానికి, ఏఐ యుగంలో భారత్‌ను టెక్ లీడర్‌షిప్ స్థానంలో నిలబెట్టడానికి పరిశ్రమ, విద్యారంగం, ప్రభుత్వం మధ్య సహకారం అవసరం ఉందని నాస్కామ్ వెల్లడించింది.

## టెక్నాలజీ

### వాట్సప్‌లో మెటా ఏఐతో వాయిస్ చాట్..
# త్వరలో కొత్త సదుపాయం!




ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగించే మెసేజింగ్ యాప్ వాట్సప్‌లో ఆండ్రాయిడ్ యూజర్లకు త్వరలో రియల్‌టైమ్ వాయిస్ చాట్ అందుబాటులోకి రానుంది. దీని ద్వారా మెటా ఏఐతో లైవ్ వాయిస్ చాట్ చేయొచ్చు. ఈ ఫీచర్ ప్రస్తుతం కొంతమంది బీటా యూజర్లకు మాత్రమే అందుబాటులోకి వచ్చింది. త్వరలోనే వినియోగదారులందరికీ అందుబాటులోకి రానుంది. వాట్సప్ ఫీచర్ ట్రాకర్ అయిన WABetaInfo తెలిపిన వివరాల ప్రకారం.. ఆండ్రాయిడ్‌లో ఇటీవల విడుదలైన వాట్సప్ బీటా వెర్షన్ 2.25.21.21లో ఈ వాయిస్ చాట్ మోడ్ దర్శనమిచ్చింది. చాట్ స్క్రీన్‌లో వేవ్‌ఫార్మ్ ఐకాన్‌పై క్లిక్ చేసిన తర్వాత మెటాతో పరస్పర వాయిస్ చాట్ చేయొచ్చు. లేదంటే 'సెట్టింగ్స్'లోని 'వాయిస్ ప్రిఫరెన్సెస్' సెక్షన్‌కు వెళ్లి వాయిస్ మోడ్‌ను యాక్టివేట్ చేయాలి. ఈ ఫీచర్ డిఫాల్ట్‌గా ఆఫ్ చేసి ఉంటుంది. రియల్ టైమ్ వాయిస్ చాట్ ఫీచర్ కేవలం చాట్ ట్యాబ్ వరకే పరిమితం. వినియోగదారులు కాల్ ట్యాబ్‌కు వెళ్లినపుడు మెటా ఏఐ ఐకాన్ ఆటోమేటిక్‌గా వేవ్‌ఫార్మ్ సింబల్‌గా మారుతుంది. దీంతో డీఫాల్ట్‌గా వాయిస్ చాట్‌బాట్‌లా పనిచేస్తుంది. వాయిస్ మోడ్‌లో ఉన్నప్పుడు స్క్రీన్‌పై కొన్ని టాపిక్స్ కనిపిస్తాయి. వినియోగదారులు వాయిస్ చాట్‌ను ప్రారంభించేందుకు వీటిని ఉపయోగించొచ్చు. టాప్ లెఫ్ట్ కార్నర్‌లో ఉన్న ఐకాన్‌పై ట్యాప్ చేస్తే ఈ చాట్‌ను బ్యాగ్రౌండ్‌లో కొనసాగిస్తూ ఇతర యాప్స్‌నకు కూడా వెళ్లొచ్చు. వాయిస్ మోడ్‌ను ఆపేయాలనుకుంటే స్క్రీన్ దిగువన ఉన్న 'X' బటన్‌పై ట్యాప్ చేయాలి. లేదంటే చాట్ నుంచి బయటకు వెళ్లడం, ఏదైనా టైప్ చేయడం ద్వారా వాయిస్ మోడ్‌ను ఆపేయొచ్చు. ప్రస్తుతం ఉన్న వెర్షన్‌లో యాక్టివ్ కాల్స్‌ను వాట్సాప్ ఇన్‌యాప్ కాల్ నోటిఫికేషన్ ద్వారా, ఆండ్రాయిడ్ మైక్రోఫోన్ అలర్ట్ ద్వారా చూపిస్తుంది. ఈ రియల్ టైమ్ వాయిస్ చాట్ ఫీచర్ ప్రస్తుతం పరీక్ష దశలోనే ఉంది. దీని విడుదలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

### రెడ్‌మీ నుంచి...
# 'నోట్ 14 SE'.. ప్రధాన ఫీచర్లివే!



షావోమీ సబ్‌బ్రాండ్ రెడ్‌మీ నోట్ 14 సిరీస్‌లో కొత్త ఫోన్ లాంచ్ అయింది. నోట్ 14 ఎస్‌ఈ 5జీ పేరిట లాంచ్ చేసింది. ఇందులో మీడియాటెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా ప్రాసెసర్ అమర్చారు. 5,110 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. వెనుక భాగంలో 50 ఎంపీ ప్రధాన కెమెరాతో ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్ ఇచ్చారు. 6.7 అంగుళాల FHD+ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120 Hz రిఫ్రెష్ రేటును సపోర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైపర్ ఓఎస్ 2.0తో పనిచేస్తుంది. 2,100 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్ ఉంటుంది. వెనుక భాగంలో 50 ఎంపీ సోనీ LYT 600 ప్రధాన కెమెరా, 8 ఎంపీ అల్ట్రా వైడ్, 2 ఎంపీ మాక్రో కెమెరా ఇచ్చారు. 20 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఇది 45W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్‌ను సపోర్ట్ చేస్తుంది. ఐపీ 64 డస్ట్ అండ్ స్ప్లాష్ రెసిస్టెంట్ రేటింగ్‌తో వస్తుంది. ధర విషయానికొస్తే.. ఈ ఫోన్ సింగిల్ వేరియంట్‌లో అందుబాటులోకి రానుంది. 6 జీబీ ర్యామ్ + 128 జీబీ ఇంటర్నల్ మెమొరీ వేరియంట్ ధర రూ.14,999గా కంపెనీ నిర్ణయించింది. ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై రూ.1000 వరకు రాయితీ లభిస్తుంది. క్రిమ్సన్ రెడ్, మిస్టిక్ వైట్, టైటాన్ బ్లాక్ కలర్స్‌లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో ఆగస్టు 7 నుంచి ప్రారంభం కానున్న సేల్‌లో ఈ ఫోన్ అందుబాటులోకి రానుంది. ఇక బడ్జెట్ ధరలో రానున్న ఈ మొబైల్‌కి సంబంధించిన వార్తను గూగుల్ ట్రెండ్స్ నుంచి తీసుకున్నాం.

## వైరల్ / ట్రెండింగ్

# ధర్మస్థలి మిస్టీరియస్ మర్డర్స్.. ప్రారంభం అయిన తవ్వకాలు



కర్ణాటకలో సంచలనం రేపుతున్న ధర్మస్థలి మిస్టరీ హత్యల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ధర్మస్థల మంజునాథ ఆలయంలో పని చేసిన మాజీ శానిటరీ కార్మికుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సిట్ అధికారులు.. నేత్రావతి నది ఒడ్డున తవ్వకాలు జరుపుతున్నారు. కాగా శానిటరీ వర్కర్ మృతులను పూడ్చి పెట్టిన 20 ప్రాంతాలను నిన్న గుర్తించగా.. ఆయా ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అయితే ధర్మస్థలలో పనిచేసిన ఒక మాజీ సానిటేషన్ కార్మికుడు (విసిల్‌బ్లోయర్).. తాను మంజునాథ ఆలయంలో పనిచేస్తున్నపుడు 1995-2014 మధ్య వందలాది మృతదేహాలను (ముఖ్యంగా మహిళలు, మైనర్లు) నేత్రావతి నది ఒడ్డున పూడ్చిపెట్టినట్టు సంచలన విషయాలను బయటపెట్టాడు. అందుకు సాక్ష్యంగా కొన్ని అస్థిపంజరాలను పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్ళి కంప్లైంట్ చేశాడు. ఈ ఘటనపై రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో తీవ్ర దుమారం రేగింది. కన్నడ సర్కార్ ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

# భారత స్టాక్ మార్కెట్ ర్యాలీ...

**వరుస నష్టాలకు బ్రేక్**

**కొనుగోళ్ల మద్దతుతో పుంజుకున్న బెంచ్‌మార్క్ సూచీలు**

**446.93 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

**140.20 పాయింట్లు పెరిగిన నిఫ్టీ**




**ముంబై:** భారత స్టాక్ మార్కెట్ గణనీయమైన లాభాలతో ముగిసింది. గత పలు సెషన్లుగా కొనసాగిన నష్టాలకు బ్రేక్ వేస్తూ, కొనుగోళ్ల మద్దతుతో బెంచ్‌మార్క్ సూచీలు పుంజుకున్నాయి. సెన్సెక్స్ 446.93 పాయింట్లు పెరిగి 81,337.95 వద్ద ముగిసింది. ఉదయం 80,620.25 వద్ద నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ, భారీ వెయిటేజ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రాడేలో 81,429.88 గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 140.20 పాయింట్లు (0.57 శాతం) లాభపడి 24,821.10 వద్ద స్థిరపడింది.

అమెరికా-భారత్ వాణిజ్య చర్చలపై కొనసాగుతున్న అనిశ్చితుల మధ్య దేశీయ ఈక్విటీ మార్కెట్ ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సానుకూలంగా కోలుకుంది. దాదాపు అన్ని రంగాలు లాభాలతో ముగియగా, ముఖ్యంగా మెటల్, ఫార్మా, రియల్టీ రంగాలు గణనీయమైన లాభాలను ఆర్జించాయి. అయితే, బలహీనమైన త్రైమాసిక ఫలితాల కారణంగా ఐటీ, ఫైనాన్షియల్స్, ఎఫ్‌ఎంసీజీ రంగాలు వెనుకబడ్డాయి.

అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయాలు, ఆగస్టు 1న పరస్పర సుంకాల గడువుతో సహా కీలక అంతర్జాతీయ పరిణామాలకు ముందు పెట్టుబడిదారుల సెంటిమెంట్ అప్రమత్తంగా ఉందని విశ్లేషకులు తెలిపారు. ఎల్ అండ్ టీ, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్, టాటా స్టీల్, టాటా మోటార్స్, మారుతీ సుజుకి, భారతీ ఎయిర్ టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్ ఉన్నాయి. నష్టపోయిన వాటిలో... టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ ప్రధానంగా ఉన్నాయి. విస్తృత మార్కెట్లో కూడా సానుకూల కదలిక కనిపించింది. నిఫ్టీ నెక్స్ట్ 50 610 పాయింట్లు (0.91 శాతం), నిఫ్టీ 100 158 పాయింట్లు, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 465 పాయింట్లు (0.81 శాతం), నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 186.70 పాయింట్లు (ఒక శాతానికి పైగా) లాభపడ్డాయి. మెజారిటీ సెక్టోరల్ ఇండెక్స్‌లు లాభాలతో ముగిశాయి. నిఫ్టీ బ్యాంక్ 137 పాయింట్లు, నిఫ్టీ ఫిన్ సర్వీసెస్ 85 పాయింట్లకు పైగా, నిఫ్టీ ఆటో 195 పాయింట్లు పెరిగాయి. అయితే, రూపాయి బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే 0.14 పాయింట్లు తగ్గి 86.80 వద్ద ముగిసింది, ఇది 0.16 శాతం క్షీణత. డాలర్ ఇండెక్స్ 99 మార్కుకు చేరుకోవడంతో దేశీయ మార్కెట్లలోని లాభాలు తేలిపోయాయి.

## ఇకపై పిన్‌తో పనిలేదు..

**ఇలా చేస్తే వెంటనే ట్రాన్సాక్షన్.. త్వరలోనే..**




**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఎక్కడ చూసిన డిజిటిల్ పేమెంట్సే.. కూరగాయల నుంచి పెద్ద పెద్ద ట్రాన్సాక్షన్ వరకు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్స్‌నే వాడుతున్నారు. యూపీఐ ఛార్జీలపై ఎటువంటి ఛార్జీలు లేకపోవడం కూడా డిజిటల్ పేమెంట్స్ పెరగడానికి ఓ కారణంగా. ఇక ఎప్పటికప్పుడు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అప్ డేట్స్ తీసుకొస్తూనే ఉంది. ఇప్పటికే యూపీఐ బ్యాలెన్స్ చెకింగ్ వంటి వాటిపై లిమిట్ పెట్టింది. ఈ క్రమంలో ప్రజలకు ట్రాన్సాక్షన్ ఈజీగా అయ్యేలా మరో అప్‌డేట్ తీసుకొచ్చేందుకు ఎన్‌పీసీఐ సిద్ధమైంది. ఇది యూపీఐ చెల్లింపులు చేసే వ్యక్తులకు ఒక గుడ్ న్యూస్‌గా చెప్పొచ్చు. వినియోగదారులు పిన్ నమోదు చేయకుండానే యూపీఐ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. యూపీఐలో బయోమెట్రిక్ అప్‌డేట్‌ను తీసుకురావడానికి ఎన్‌పీసీఐ సన్నాహాలు చేస్తోంది. ఇకపై యూజర్స్ పిన్ ఎంటర్ చేయకుండానే ఫేస్ లేదా ఫింగర్ ద్వారా ట్రాన్సాక్షన్ చేయవచ్చు. అయితే పిన్ కోసం కూడా ఆప్షన్ ఉంటుంది.

### ఇది ఎలా పని చేస్తుంది?

యూపీఐలో బయోమెట్రిక్ అప్‌డేట్‌తో వినియోగదారులు చెల్లింపు చేయడానికి పిన్ నమోదు చేయవలసిన అవసరం లేదు. ఫేస్ లేదా ఫింగర్ ను యూజ్ చేస్తే సరిపోతుంది. అనేక పిన్ నంబర్‌లను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడుతున్న వారికి ఇది మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుందనే దాని గురించి స్పష్టమైన సమాచారం లేదు. కొన్ని అప్‌డేట్‌ల ప్రకారం.. బయోమెట్రిక్ అప్‌డేట్ తర్వాత మీరు క్యూఆర్ స్కాన్ చేసినప్పుడు, బయోమెట్రిక్ అంటే ఫింగర్ లేదా ఫేస్ ఆప్షన్ పిన్‌తో పాటు వచ్చే అవకాశం ఉంది. వినియోగదారులు దానిపై క్లిక్ చేస్తే పేమెంట్ అయిపోతుంది.

### ఈజీ-భద్రత

బయోమెట్రిక్ అప్‌డేట్‌తో ఎక్కువ చదువుకోని కూడా ఈజీగా ట్రాన్సాక్షన్ చేయవచ్చు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో వారికి బాగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ప్రజలు ఎన్నో యాప్స్ వాడుతూ.. అన్ని పిన్ నంబర్లను గుర్తుంచుకోవడం కష్టంగా మారుతుంది. ఫోన్ పాస్‌వర్డ్ నుండి ఏటీమ్ వరకు అనేక నంబర్‌లను గుర్తుంచుకోవడం సులభం కాదు. ఒక్కోసారి మర్చిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ అప్‌డేట్ అటువంటి వారికి బాగా ఉపయోగపడుతుంది. భద్రత పరంగానూ బయోమెట్రిక్ సురక్షితమైనది. మీరు తప్ప దానిని ఎవరూ యాక్సెస్ చేయలేరు.

## ఈ కారు రికార్డ్ స్థాయిలో అమ్మకాలు..

**80 దేశాలలో ఆధిపత్యం చెలాయిస్తోంది!**



**న్యూఢిల్లీ:** భారతదేశంలో దాదాపు 2 సంవత్సరాల క్రితం ప్రారంభించిన మారుతి ఫ్రాంక్స్ అంతర్జాతీయ మార్కెట్లో అద్భుతాలు చేసింది. మారుతి ఫ్రాంక్స్ 25 నెలల్లో 1 లక్ష యూనిట్లకు పైగా ఎగుమతి సంఖ్యను దాటింది. ఈ సంఖ్య భారతదేశ ఆటోమొబైల్ ఎగుమతి పరిశ్రమకు ఒక ముఖ్యమైన విజయం. మారుతి సుజుకి తన ఫ్రాంక్స్ భారతదేశంలో అత్యంత వేగంగా ఎగుమతి చేయబడిన క్రాస్ఓవర్ మారిందని, ఇది 1 లక్ష ఎగుమతి యూనిట్ల సంఖ్యను దాటిందని కంపెనీ తెలిపింది.

మారుతి సుజుకి ఫ్రాంక్స్ కారు గుజరాత్ ప్లాంట్‌లో మాత్రమే తయారు అవుతుంది. ఇది భారతదేశంలో ఏప్రిల్ 2023లో ప్రారంభించారు. దాని ఎగుమతి కూడా అదే సంవత్సరం నుండి ప్రారంభమైంది. నేడు ఈ కారు లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా వంటి పెద్ద మార్కెట్లతో సహా 80 కి పైగా దేశాలకు సరఫరా అవుతోంది. దీనికి జపాన్‌లో అత్యధిక డిమాండ్ ఉంది.దాని కారణంగా దాని ఎగుమతి కూడా భారీగా ఉంది.

మారుతి సుజుకి ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే 69,000 కంటే ఎక్కువ ఫ్రోర్డ్ కార్లు విదేశాలకు రవాణా అయ్యాయి. దీనితో ఆ సంవత్సరం భారతదేశం నుండి అత్యధికంగా ఎగుమతి చేయబడిన ప్యాసింజర్ కారుగా ఇది నిలిచింది. కంపెనీ ఎగుమతులు నిరంతరం పెరుగుతున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లలో తన పట్టును బలపరుస్తున్నాయని ఇది చూపిస్తుంది.

# పిచ్ క్యూరేటర్‌తో గంభీర్ వాగ్వాదం..

**'తగ్గేదేలే' అంటూ వార్నింగ్..?**




**మాంచెస్టర్:** మాంచెస్టర్‌లో అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించిన భారత జట్టు ఓవల్ టెస్టుకు సన్నద్ధమవుతోంది. నిర్ణయాత్మక ఈ మ్యాచ్‌కు ఇంకా రెండు రోజులే ఉండడంతో గట్టిగా నెట్స్‌లో చెమటోడ్చుతోంది గిల్ బృందం. అయితే.. భారత క్రికెటర్లు ప్రాక్టీస్ చేస్తుండగా ఓవల్ పిచ్ క్యూరేటర్ అభ్యంతరం తెలిపాడు. దాంతో, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ అతడితో వాగ్వాదానికి దిగాడు. అసలు ఎందుకు వీరిద్దరూ గొడవపడ్డారంటే..?

మంగళవారం రోజు భారత క్రికెటర్లు ఓవల్ మైదానంలో నెట్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కోచ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్స్ కొటాక్ ఆటగాళ్లను గమనిస్తున్నారు. ఈ సమయంలోనే పిచ్ క్యురేటర్ లీ ఫోర్టిస్( %బావవ ఖీశీతీఱం%) అక్కడికి వచ్చాడు. అతడు ఇదేంటీ మీరు ఎక్కువ ఇక్కడ సాధన చేస్తున్నారు? మీకు అనుమతి ఇచ్చింది అక్కడి వరకేగా అని అన్నాడు. మామూలుగానే ముక్కు మీద కోపంతో ఊగిపోయే గౌతీకి అతడలా అనేసరికి చిర్రెత్తుకొచ్చింది.

'నువ్వు కేవలం మైదానం సిబ్బంది మాత్రమే. మేము ఇక్కడే ప్రాక్టీస్ చేసుకుంటాం. మేము ఏం చేయాలో నువ్వు చెప్పనక్కర్లేదు. మాకు అన్నీ తెలుసు అని ఎవరికి ఫిర్యాదు చేస్తావో చేసుకో' అని అతడితో తెగేసి చెప్పాడు. గంభీర్ ఒక్కసారిగా అలా అనేసరికి ఫోర్టిస్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. బ్యాటింగ్ కోచ్ అతడికి సర్ది చెప్పాడు. ప్రస్తుతం టీమిండియా కోచ్, క్యురేటర్ ఫోర్టిస్‌ల వాగ్వాదానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతోంది.



### గెలిచి తీరాల్సిందే

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య జూలై 31 బుధవారం చివరిదైన ఐదో టెస్టు జరుగనుంది. ప్రస్తుతానికి రెండు జట్లు ఆతిథ్య జట్టు రెండేసి విజయాలతో ముందజంలో ఉంది. మాంచెస్టర్‌లో డ్రాతో బతికిపోయిన టీమిండియా గెలిచి తీరాల్సిందే. డ్రా చేసుకున్నా సరే స్టోక్స్ సేన విజేతగా నిలుస్తుంది. సో.. ఏవిధంగా చూసినా ఓవల్ టెస్టు గిల్ బృందానికి చావోరేవో లాంటిదే. కుడి పాదం వేలి గాయంతో వైస్ కెప్టెన్ పంత్ దూరమవ్వడం కొంత ఇబ్బందికరమే. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. అయితే.. నాలుగో టెస్టుకు విశ్రాంతితీసుకున్న ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్‌లు కోలుకోవడంతో భారత బౌలింగ్ యూనిట్ మరింత బలంగా మారనుంది.

## యూత్ ఓపెన్ రెగెట్టాలో రిజ్వాన్ ముందంజ..

**రెండోస్థానంలో బన్నీ**

**హైదరాబాద్:** హుస్సేన్ సాగర్‌లో సికింద్రాబాద్ క్లబ్ టిస్కాన్ యూత్ ఓపెన్ రెగెట్టా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండోరోజు పోటీల్లో ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో ఎన్‌వైఎస్‌సీ టీమ్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆరు రేసుల్లో 10 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు రిజ్వాన్. టీఎస్‌సీకి చెందిన బొంగూర్ బన్నీ రెండో స్థానం, ఆర్‌ఎంవైసీ తరఫున పోటీపడిన కృష్ణా వెంకటాచలం మూడో స్థానం దక్కించుకున్నారు.

బాలికల విభాగంలో సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన శ్రింగేరి రాయ్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఓవరాల్‌గా అగ్రస్థానంలో ఉంది. ఐఎల్‌సీయే బాలుర కేటగిరీలో ఎన్‌వైఎస్‌సీకి చెందిన రమాకాంత్ సత్తా చాటాడు. ఆరు రేసుల్లో 19 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో ఆస్థా పాండే ముందంజలో ఉంది.






వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తొలిరోజు వాయిదా పడిన ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్ కేటగిరీ రెండో రోజు జరిగింది. 36 మంది యువ సెయిలర్లు పోటీపడగా.. టీఎస్‌సీకి చెందిన యువరాజ్ అగ్రస్థానం సాధించాడు. అటు బాలికల విభాగంలో సీఈఎస్‌సీకి చెందిన సోనియా బ్రార్ సత్తా చాటింది.

## ఇండోపాక్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నా అంతరాత్మ ఒప్పుకోదు: అసదుద్దీన్ ఓవైసీ

**న్యూఢిల్లీ:** ఇండియా, పాకిస్థాన్ క్రికెట్‌కు ఎంత క్రేజీ ఉందో తెలిసిన విషయం తెలిసిందే. ఆ రెండు జట్లు తలపడితే ఆ టెన్షనే వేరు. అయితే తాజాగా ఆసియా కప్ షెడ్యూల్ రిలీజ్ అయ్యింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన ఆ రెండు జట్లు దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడితే ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు తన అంతరాత్మ ఒప్పుకోదన్నారు.



పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలహీనపడిన విషయం తెలిసిందే. ఇలాంటి సందర్భంలో ఎలా పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతారని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్ విమానాలు మన వైమానిక క్షేత్రంలోకి రావడం లేదని, మన జలాల్లోకి వాళ్ల బోట్లు రావడం లేదని, ఆ దేశంతో వాణిజ్యం జరగడం లేదని, అలాంటప్పుడు పాకిస్థాన్‌తో ఎలా క్రికెట్ ఆడుతారని ఓవైసీ ప్రశ్నించారు.

ఆ దేశానికి మనం నీళ్లు ఇవ్వడం లేదని, పాక్‌కు వెళ్లే 80 శాతం నీటిని ఆపేస్తున్నామని, రక్తం.. నీరు ఒకేసారి పారవని అంటున్నామని, అలాంటప్పుడు ఆ దేశంతో ఎలా క్రికెట్ ఆడుతారని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు తన అంతరాత్మ అంగీకరించదన్నారు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి జరిగే ఆసియాకప్‌లో 8 దేశాలు ఆడనున్నాయి.

# బెంగళూరులో దులీప్ ట్రోఫీ.. నాగ్‌పూర్‌లో ఇరానీ కప్..!

**బెంగళూరు:** దేశవాళీ క్రికెట్ పండుగకు మరో ఇరవై రోజుల్లో తెరలేవనుంది. ఆగస్టు చివరి వారంలో బెంగళూరు వేదికగా దులీప్ ట్రోఫీతో డొమెస్టిక్ సీజన్ 2025-26 ప్రారంభం కానుంది. ఆ వెంటనే టీ20 ఫార్మాట్లో జరుగబోయే ఇరానీ కప్ మ్యాచ్‌లకు నాగ్‌పూర్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి టీమిండియా స్టార్ తిలక్ వర్మ సారథిగా తన తడాఖా చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇంటర్ జోన్ ఫార్మాట్లో జరుగనున్న దులీప్ ట్రోఫీలో తిలక్ సౌత్ జోన్ జట్టును నడిపించనున్నాడు.

దులీప్ ట్రోఫీ ఇంటర్ జోన్ ఫార్మాట్లో జరుగనున్న దులీప్ ట్రోఫీఆగస్టు 18న మొదలై సెప్టెంబర్ 15న ముగుస్తుంది. బీసీసీఐ కొత్తగా నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. టైటిల్ కోసం ఆరుజట్లు కాచుకొని ఉన్నాయి. సౌత్ జోన్, సెంట్రల్ జోన్, వెస్ట్ జోన్, ఉత్తర జోన్, తూర్పు జోన్, ఈశాన్య జోన్ టీమ్స్ తలపడనున్నాయి. వీటిలో సౌత్, వెస్ట్ జోన్ జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. ఆగస్టు 28నార్త్, ఈస్ట్ మధ్య ఆగస్టు 31న సెంట్రల్, ఈశాన్య జోన్ల మధ్య క్వార్టర్ ఫైనల్ ఫైట్ జరుగనుంది. సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకూ సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 11న జరిగే ఫైనల్‌తో టైటిల్ విజేత ఎవరో తేలిపోనుంది.



### కరుణ్ ఏ జట్టుకు

దులీప్ ట్రోఫీ తర్వాత నాగ్‌పూర్ వేదికగా ఇరానీకప్ జరుగనుంది. గత సీజన్ రంజీ విజేత విదర్భ, రెస్ట్ ఆఫ్ ఇండియాను ఢీకొననుంది. అయితే.. నిరుడు విదర్భ తరఫున పరుగుల వరద పారించిన కరుణ్ నాయర్ ఈసారి ఆడతాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. ఈమధ్యే అతడు సొంత జట్టు కర్నాటకకు మారాడు. కానీ, సౌత్ జోన్ సెలెక్టర్లు మాత్రం కరుణ్‌ను దులీప్ ట్రోఫీ స్క్వాడ్‌లోకి తీసుకోలేదు.

దాంతో, ఈ స్టార్ ప్లేయర్ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆడడంపై అనిశ్చితి నెలకొంది. మరో విషయం.. యువ పేసర్ రసిక్ దార్ సలాం జమ్ముకశ్మీర్ జట్టును వీడాడు. బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ రావడంతో ఈ స్పీడ్‌స్టర్ బరోడాకు మారాడు. ఇప్పటికే ఐపీఎల్ స్టార్ జితేశ్ శర్మ సైతం బరోడాకు ఆడేందుకు సిద్ధమయ్యాడు.




## ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పార్ట్ పూర్తి

**టాకీస్:** పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని -క్లైమాక్స్ పూర్తయినట్లు- తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ఇది ఆయన అంకితభావానికి, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనమని నిర్మాణ సంస్థ తెలిపింది ఈ విషయాన్ని తెలుపుతూ సెట్‌లో పవన్, హరీశ్ శంకర్‌ల ఫొటోను పంచుకుంది. గబ్బర్ సింగ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో దీనిపై సినీప్రియులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, స్పెషల్ వీడియోలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఇక పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.

## ఫ్యాషన్ ఈవెంట్‌లో తళుక్కుమన్న జాన్వీ కపూర్

టాకీస్: బాలీవుడ్ యంగ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఓ ఫ్యాషన్ ఈవెంట్‌లో తళుక్కున మెరిశారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరుగుతున్న హ్యుందాయ్ ఇండియా కౌచర్ వీక్ 2025లో సందడి చేశారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ జయంతి రెడ్డి రూపొందించిన పింక్ కలర్ లెహంగాలో ర్యాంప్ వాక్ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జాన్వీ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే ఎన్టీఆర్ సినిమా దేవరతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ కపూర్.. ప్రస్తుతం రామ్ చరణ్‌తో కలిసి పెద్ది చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాకు బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. దీంతో పాటు హోమ్‌బౌండ్, సన్నీ సంస్కారి కి తులసి కుమారి, పరమ్ సుందరి లాంటి బాలీవుడ్ సినిమాల్లో కనిపించనుంది.




## కింగ్డమ్ నుంచి రగిలే రగిలే లిరికల్ సాంగ్ విడుదల

### తమిళంలో వాయిస్ ఓవర్ ఇచ్చిన సూర్య

టాకీస్: విజయ్ దేవరకొండ ప్రధానపాత్రలో రానున్న 'కింగ్డమ్' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కింది. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా 'రగిలే రగిలే' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు 'మృత్యువు జడిసేలా.. శత్రువు బెదిరేలా..పద పద..' అనే పవర్‌ఫుల్ లిరిక్స్‌ను కృష్ణకాంత్ రాయగా.. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు.




ఈసందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు-చేశారు. అందులో విజయ్ మాట్లాడుతూ హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీ-జర్‌కు వాయిస్ ఓవర్ ఇస్తారా అని అడగ్గానే అంగీకరించారని తెలిపారు. కింగ్డమ్' కథ అనుకోగానే దీన్ని తమిళంలో కూడా కచ్చితంగా విడుదల చేయాలని భావించాం. ఈ సినిమా విడుదలకు ముందు ముఖ్యంగా ఇద్దరికి కృతజ్ఞతలు చెప్పాలి. వారిలో ఒకరు హీరో సూర్య. నాకు మొహమాటం ఎక్కువ. ఎవరిని సాయం అడగలేను. 'కింగ్డమ్' తమిళ టీజర్‌కు సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు తెలిపారు. నేను ఈ మాట అడగ్గానే సూర్య ఓకే చెప్పారు. ఆయన పవర్‌ఫుల్ వాయిస్ టీజర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చేసింది. థాంక్యూ సూర్య అన్న అని అన్నారు. ఇక రెండో వ్యక్తి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్.. అతడు ఈ సినిమాకు ప్రాణం పెట్టాడు. ఇప్పటికీ దీని పనుల్లోనే బిజీగా ఉన్నాడు. అతడిని కిడ్నాప్ చేసి నాతోపాటే ఉంచుకోవాలని ఉంది. ఈ సినిమా విషయంలో నేను చెప్పిన అప్‌డేట్స్ కంటే అనిరుధ్ చెప్పినవే వైరల్ అయ్యాయి. ఇటీ-వల జరిగిన ఈవెంట్‌లో కూడా ఈ చిత్రం మా అందరికీ మైల్‌స్టోన్ అవుతుందని అనిరుధ్ చెప్పాడు. ఆ మాటనే ఎంతోమంది షేర్ చేశారు. మరో రెండు రోజుల్లో 'కింగ్డమ్' మీ ముందుకురానుంది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని తెలిపారు.

## విజయవాడ వేదికగా 10న వార్-2 ప్రీరిలీజ్ వేడుక



**టాకీస్:** యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బడ్జెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. రిలీజ్ కు గట్టిగా రెండు వారాలు ఉంది. ఇద్దరు బడా స్టార్స్ ఉన్న సినిమాకు ప్రస్తుతం ఉన్నబజ్ సరిపోదు. అందుకే తెలుగు హక్కులు దక్కించుకున్న నిర్మాత కమ్ డిస్ట్రిబ్యూటర్ వార్ 2 కోసం భారీ ప్లానింగ్ రెడీ చేస్తున్నాడు. అందులో భాగంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు రంగం సిద్ధం చేస్తున్నాడు. కానీ ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ తో సెన్సేషన్ క్రియేట్ చేయాలనీ నాగవంశీ వ్యూహ రచన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో విజయవాడ లో ఆగస్టు 10న వార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించనున్నారు. నిన్న, మొన్నటి వరకు కేవలం ఊహాగానాలు వినిపించగా ఇప్పుడు అక్కడే ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. ఈ వేడుకకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో పాటు బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా హాజరుబోతున్నారట. అదే జరిగితే వార్ 2 ఈవెంట్ హిస్టారీ క్రియేట్ చేయడం ఖాయం.

## చందమామల కథ స్ఫూర్తితో విశ్వంభర

**టాకీస్:** చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'కి సంబంధించిన ఆసక్తికర విషయాల కోసం చిరు అభిమానులతో పాటు- సినీప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంగతులు పంచుకున్నారు. దీని టీజర్ విడుదలయ్యాక 'అవతార్'కు కాపీ అంటూ వచ్చిన ట్రోల్స్‌పై మాట్లాడారు. టీజర్ నాకు నచ్చింది కాబట్టి నేను రిలీజ్ చేశాను. అందులో కనిపించిన పాప




కాస్ట్యూమ్‌ను చూసి అందరూ నేను అవతార్ సినిమా కాపీ చేసి దాన్ని రూపొందించానని అన్నారు. టీజర్‌లో కనిపించిన కొండలు,ఆ పాప చెవులు చూసి అలా భావించారు. కానీ, కొండలను 'అవతార్' కంటే ముందు ఎన్నో సినిమాల్లో చూపించారు. ఇక చెవులు కూడా పెద్దగా ఉండడం గతంలో చాలా సినిమాల్లోని పాత్రల్లో చూపారు. నేను చందమామ కథలు చూసి స్ఫూర్తి పొంది అలా కాస్ట్యూమ్ డిజైన్ చేయించాను. అవతార్ చూసి కాపీ కొట్టాననే బదులు ఈ కథలను చూసి కాపీ కొట్టాను అంటే చాలా ఆనందించేవాడిని. చందమామ కథల్లో జ్వాలాదీపం అనే సిరీస్ ఉంటుంది. అందులో ఉన్నవే అవతార్‌లో చూపించారని అన్నారు. ఇందులో ఐదుగురు హీరోయిన్స్ ఉన్నారంటూ వార్తలు వస్తున్నాయి. మెయిన్ హీరోయిన్ త్రిష, సెకండ్ లీడ్ ఆషిక వాళ్లిద్దరు మాత్రమే ఉన్నారు. విడిగా నటీమణులు కొన్ని పాత్రల్లో కనిపిస్తారు. స్క్రీన్‌పై వీళ్లందరూ చాలా ఫ్రెష్‌గా ఉంటారు. వీఎఫ్ఎక్స్ వర్క్ కారణంగానే దీని విడుదల ఆలస్యమవుతుంది. ఇక ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.

## తరుణ్‌కు హిట్ ఇచ్చిన నువ్వులేక నేనులేను

**టాకీస్:** 2002లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అందమైన కుటుంభ ప్రేమకథ చిత్రం 'నువ్వు లేక నేను లేను'. హీరో తరుణ్ కు మంచి బ్రేక్ ఇచ్చిన సినిమా ఇది. కానీ ఈ సినిమాలో అసలు మొదటగా మహేశ్ బాబు తో




చేయాలనుకున్న విషయం ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ సినిమాకి దర్శకత్వం వహించిన కాశీ విశ్వనాథ్ ఒక ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికర విషయం వెల్లడించారు.. సినిమా స్క్రిప్ట్ రెడీ అయిన తర్వాత, నిర్మాత సురేష్ బాబు ఈ కథను మహేశ్ బాబుతో చేద్దామా? అని అడిగారు. దానికి కాశీ విశ్వనాథ్ స్పందిస్తూ - 'మహేశ్ తో సినిమా అంటే ఇంకా ఆలస్యం అవుతుంది. ఆయన డేట్స్ కోసం పెద్ద లైన్ ఉంటుంది. ఇప్పటికే నాకు ఆలస్యమైంది. ఇదే తరుణ్‌కు బాగా సరిపోతుందని చెప్పారు. అలా చివరికి మహేశ్ బాబు అవకాశాన్ని వదిలివేయడంతో తరుణ్ ఛాన్స్ దక్కించుకున్నాడు. ఈ చిత్రం విడుదలై మంచి విజయాన్ని సాధించడంతో పాటు-, ఆయన కెరీర్‌కు మరో మైలురాయిగా నిలిచింది' అని తెలిపారు..




## సతీలీలావతిగా లావణ్య త్రిపాఠి

టాకీస్: వరుణ్ తేజ్‌ని వివాహం చేసుకొని మెగా కోడలిగా మారింది లావణ్య త్రిపాఠి. 2022లో నటించిన హ్యాపీ బర్త్ డే సినిమా తర్వాత లావణ్య త్రిపాఠి సతీ లీలావతి అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా సతీ లీలావతి టీజర్ విడుదల చేశారు. లవ్, డ్రామా ఎలిమెంట్స్‌తో సాగే ఫన్నీ రైడ్ మాదిరిగా టీజర్ ఉంది. టీజర్ చూస్తుంటే చిత్రాన్ని పురుషులు కూడా గృహ హింసకు బలవుతారనే పాయింట్ చుట్టూ తెరకెక్కించినట్టు అర్థమవుతుంది. ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కొణిదెల ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఆమెకు జంటగా మలయాళ హీరో దేవ్ మోహన్ కనిపించనున్నారు. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్ పతాకంపై నాగమోహన్ నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ దీనిని సమర్పిస్తోంది.

పెళ్లి వేడుకల దృశ్యాలతో టీజర్ ప్రారంభం కాగా , ఆ తర్వాత ఆ దంపతుల మధ్య ఏర్పడే విభేదాలను చూపించారు. "నాకు ఎందుకో హ్యాపీగా లేనప్పుడు మనం విడిపోవడమే కరెక్ట్ అనిపిస్తుంది" అంటూ దేవ్ మోహన్ డైలాగ్ ప్రేక్షకులను ఆలోచనలో పడేస్తుంది. అతడిని కుర్చీలో కట్టేసిన సీన్, "లీలా నన్ను కొడతావా?" అన్న ప్రశ్నకు "ఏం డౌటా?" అంటూ లావణ్య ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్, కామెడీ టచ్ తో వినోదాన్ని కలిగిస్తుంది. ఇందులో వీటీవీ గణేష్, సప్తగిరి, మొట్ట రాజేంద్రన్ లాంటి నటులు హాస్యాన్ని మేళవించనున్నారు.

'భార్యా-భర్తల మధ్య నడిచే మనస్పర్థలు, అనుబంధం, ఆవేశం, వినోదం, భావోద్వేగాలు అన్ని కలగలిసిన మిశ్రమమే ఈ చిత్రం' అని మేకర్స్ చెబుతున్నారు. ఇది పూర్తిగా ఆధునిక దృక్కోణంలో తీసిన ఫీల్ గుడ్ ఎంటర్టైనర్గా ఉ ండనుందని తెలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న 'సతీ లీలావతి' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతోంది. కొంతకాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న లావణ్య త్రిపాఠి సతీలీలావతిగా గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వనుందని అర్థమవుతుంది. ఈ చిత్రానికి మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.